క్లుప్తంగా

కార్గిల్ సైనికుల త్యాగాలను స్మరిస్తూ ర్యాలీ



రామవరప్పాడు: కార్గిల్ యుద్ధం చరిత్రలో లిఖించాల్సిన గొప్ప విజయమని సుబేదార్ మేజర్, ఎన్టీఆర్ జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ ప్రెసిడెంట్ శివ నాగేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు విజయా ఫార్మసీ మహిళా కళాశాలలో శనివారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ 'మేరా యువ భారత్ మై భారత్' కార్యక్రమంలో భాగంగా కార్గిల్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరవీరులైన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివనాగేశ్వరరావు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో 524 మందిసైనికులు ప్రాణాలను అర్పించి గొప్ప విజయాన్ని దేశానికి అందించారన్నారు.విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. మనమంతా స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే మన దేశ సైనికులే కారణమన్నారు. జిల్లా యూత్ అధికారి సుంకర రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



పెనమలూరు: పెదపులిపాక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పాలకవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ సొసైటీలతో రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వాలన్నారు. మంచి సేవలు అందించి గుర్తింపు తీసుకురావాలని తెలిపారు. చైర్ పర్సన్‌గా గుంటూరు విశ్వేశ్వరరావు, డైరెక్టర్లుగా ఎం.అచ్చయ్య, కొండేటి దుర్గారావు ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, నేతలు దాసరి హరినీడు, కోయా ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు, ముసు నూరి శ్రీనివాసరావు, ముసునూరి శ్రీధర్, నిర్మల్‌కుమార్, రామ్‌కుమార్, గజ్జర్లపూడి బాబూరావు. అబ్దుల్ సలాం, సంగెపు రంగారావు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): అజిత్ సింగ్‌నగర్ వివేకానంద హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న తమ కుమార్తె శుక్రవారం హైస్కూల్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, వాంబే కాలనీలో మహిళకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు పదవ తరగతి చదువుతోంది. ఈనెల 25న స్కూల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. స్కూల్ లో విచారించగా స్కూల్‌కు రాలేదని ఉపాధ్యాయులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమానికి దూరంగా హాస్టళ్లు

- మూతబడ్డ గొడవర్రు బాలికల వసతిగృహం
- కంకిపాడు బాలుర వసతి గృహం గొడవర్రుకు తరలింపు
- ఒక్క విద్యార్థి కూడా చేరని వైనం
- మూసివేసినట్టేనంటున్న అధికారులు



గొడవర్రులోని వసతిగృహ భవన సముదాయం



కంకిపాడులోని వసతిగృహ భవనం



గొడవర్రుకు తరలించినట్లు ఏర్పాటు చేసిన బ్యానరు

సాక్షి గ్రౌండ్ రిపోర్టు

కంకిపాడు: వసతి గృహ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. కనీస మరమ్మతులు చేపట్టి వసతులు కల్పించకుండా వదిలేయటంతో మూతబడుతున్నాయి. కూటమి సర్కారు అలసత్వం కారణంగా సంక్షేమ వసతి గృహాలు సంక్షేమానికి దూరమవుతున్నాయి.

నియోజకవర్గంలో మూడు హాస్టళ్లు

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరులో 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఎస్సీ బాలికల వసతి గృహం, కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లులో ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహం, ఉయ్యూరులో గిరిజన గురుకుల వసతి గృహం ఉన్నాయి. వీటిలో ఉయ్యూరు వసతి గృహంలో 300 మంది విద్యార్థులకు గానూ 94 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. గణిత ఉపాధ్యాయుడు మినహా అన్ని పాఠ్యాంశాలకు ఉపాధ్యాయులు ఉన్నారు. జంపకానాలు, దుప్పట్లు అన్నీ పంపిణీ జరిగాయి. అయితే టు టైర్‌కార్పు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. కార్పు రావాల్సి ఉంది. ప్రస్తుతం విద్యార్థులు కిందే పడుకోవాల్సి వస్తోంది.

మూతబడ్డ గొడవర్రు వసతి గృహం

గొడవర్రు గ్రామంలో ఎస్సీ బాలికల వసతి గృహం నిర్వహించేవారు. గత విద్యాసంవత్సరం వరకూ ఇందులో కేవలం 13 మంది మాత్రమే విద్యార్థినులు విద్యనభ్యసించారు. భవనం శిథిలావస్థకు చేరింది. నీటి వసతి అంతంతమాత్రమే. మరుగుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయి. వసతుల కల్పనకు ఎప్పటికప్పుడు అంచనాలు రూపొందించారే కానీ మరమ్మతులకు నోచుకోలేదు. విద్యార్థుల సంఖ్య కూడా పెరగకపోవటానికి స్థానికంగా నెలకొన్న సమస్యలు ఓ కారణం. దీంతో ఈ ఏడాది ఈ వసతి గృహాన్ని మూసివేశారు.

కంకిపాడు వసతి గృహం తరలింపు

2019కు పూర్వం కంకిపాడు, తెన్నేరు గ్రామాలో బాలుర వసతి గృహాలు ఉండేవి. అవి అప్పటి నుంచీ మూసివేసే ఉంచారు. కూటమి ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం కంకిపాడు వసతిగృహాన్ని తిరిగి వినియోగంలోకి తెస్తున్నామని చెబుతూ శిథిలావస్థలో ఉన్న గొడవర్రు వసతి గృహానికి కంకిపాడు వసతి గృహాన్ని తరలించింది. గొడవర్రు కేంద్రంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ బాలుర వసతి గృహం ఏర్పాటు చేస్తున్నట్లు కంకిపాడు వసతి గృహం వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి వరకు గొడవర్రులో ఒక్క విద్యార్థి పేరు కూడా నమోదు కాలేదు.

భవనాలు శిథిలం.. స్థలాలు ఆక్రమణ

ప్రస్తుతం కంకిపాడు వసతిగృహం కూడా శిథిలావస్థకు చేరువలో ఉంది. ఎంతో కాలంగా వినియోగంలో లేకపోవటంతో భవనం పరిసరాలు ఆక్రమణకు గురయ్యాయి. కొందరు దుకాణదారులు తమ దుకాణాల్లో వస్తుసామగ్రిని వసతి గృహం ప్రాంగణంలో నిల్వచేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు కన్నెత్తి చూడని పరిస్థితి. వసతి గృహాల మరమ్మతులను సర్కారు గాలికొదిలేయటంతో మండల ప్రధాన కేంద్రంలో ఉన్నా నిరుపయోగంగా మారిందని పలువురు స్థానికులు వాపోతున్నారు.

పెదపులిపాక ఘాట్‌ను తాకిన వరద నీరు



పెదపులిపాక ఘాట్ వద్ద కృష్ణానదిలో నీరు

పెనమలూరు: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానదిలో వరద పెరుగుతోంది. మండల పరిధిలో కృష్ణానది యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల పరిధిలో ప్రవహిస్తుంది. నదిలో వరద నీరు పెరుగుతుండటంతో పెదపులిపాక, చోడవరం గ్రామాలలో ఘాట్‌కు వరద నీరు చేరుకుంది. నదిలో వరద నీరు ప్రవహిస్తుండటంతో నదిలోకి ఎవరూ వెళ్లటం లేదు. భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేయటంతో పెద్ద పెద్ద గుంతలు నదిలో ఉండటంతో రైతులు, పశువులు కాసేవారు నదిలోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. పొరపాటున గుంతల్లో పడితే ప్రాణానికే ప్రమాదమంటున్నారు. నదిలో వరద నీరు ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎవరూ నదిలోకి వెళ్లరాదని సూచిస్తున్నారు.

చెత్తకుప్పలు తొలగించండి సారూ!



అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం జన్మభూమి రోడ్డులో గత కొన్ని రోజులుగా నిల్వ బెట్టిన చెత్తకుప్పలను తొలగించాలని అంబాపురం, పి.నైనవరం గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామ పంచాయతి పారిశుద్ధ్య కార్మికులు చెత్తను రోడ్డు వెంబడి డంప్ చేశారు. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై చెత్తకుప్పల నుంచి దుర్వాసన వెదజల్లుతోందంటున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యర్థాలనుంచి వచ్చే దుర్వాసనతో ముక్కు మూసుకొని వెళ్లవలసి వస్తోందని, అధికారులు సత్వరమే స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తున్న సీఐ శివప్రసాద్

గన్నవరం: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ నాయకత్వ లక్షణాలను అలవార్చుకోవాలని గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీవీ.శివప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక వీఎస్.సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో నూతనంగా ఎన్నికైన ఒకటి నుంచి 8వ తరగతి బాలుర, బాలికల క్యాబినెట్ విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ విద్యార్థి నేతలకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడా, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో రాణించాలని చెప్పారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ రెవ.బ్రదర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రతియేటా క్యాబినెట్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో దేశాన్ని ఉన్నతంగా నడిపించే ఉత్తమ నాయకులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య, రెవ.బ్రదర్ సీజే. థామస్, సీనియర్ బ్రదర్ జిమ్మికురియో కోస్, రెవ.బ్రదర్ భల్లా జోసెఫ్, రెవ.బ్రదర్ జయబాలన్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు



పొక్లెయిన్‌తో సెంట్రల్ డివైడర్‌ను పగలకొడుతున్న దృశ్యం (ఫైల్)

గన్నవరం: స్థానిక గన్నవరం- ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. రహదారి విస్తరణ పనులు ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కొలిక్కి రాలేదు. విస్తరణ పనుల కోసం ప్రస్తుతం ఉన్న సెంట్రల్ డివైడర్‌ను కూడా పగులకొట్టారు. ఈ డివైడర్‌పై గ్రామ పంచాయతీ నిధులు సుమారు రూ.3 లక్షలతో ఇటీవల అభివృద్ధి చేసిన గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. మొక్కలకు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన వాటర్ పైపులైన్‌ను కూడా తొలగించారు. దీనివల్ల గ్రామ పంచాయతీకి లక్షలాది రూపాయిలు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సమాన కొలతల మేరకు నూతన డివైడర్ నిర్మాణం చేస్తామని చెబుతున్నారు. అంతే కాకుండా రహదారికి ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం కూడా నత్తనడకన సాగుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం చిత్తడిగా మారింది. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్ నిర్మాణం కోసం గుంతలు తవ్వడంతో దుకాణదారులు సైతం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరిస్థితులను చిరునవ్వుతో అధిగమించాలి

నున్న(విజయవాడరూరల్): ఇంజినీరింగ్ విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను పెంచుకొంటూ ఎలాంటి పరిస్థితులనైనా చిరునవ్వుతో అధిగమించగలగాలని ఎన్ఐటీ తాడేపల్లిగూడెం ప్రొఫెసర్ డాక్టర్ టి. కార్తికేయ శర్మ సూచించారు. నున్న వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం దిశ భారత్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్తికేయ శర్మ మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రక్రియల ద్వారా మన ఆత్మ విచారణ శక్తి, సృజనాత్మకత, ఉత్తేజం, మేధస్సు పెంపొందించి మన వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడేవిధంగా తోడ్పడతాయన్నారు. ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అంతరిక్ష, రక్షణ రంగంలో భారతదేశం ప్రపంచానికి మార్గదర్శనం చేసే స్థాయిలో అభివృద్ధి చెందిందన్నారు. ఈ స్ఫూర్తితో విద్యార్థులందరూ దేశ నిర్మాణంలో భాగం కావాలని అన్నారు. డాక్టర్ బి.సతీష్ డేటా ఇంజినీర్ క్విజ్ ద్వారా భారతదేశ సాంకేతిక గొప్పతనం గురించి తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు భారతదేశం అభివృద్ధిలో భాగం కావాలన్నారు. దిశ భారత్ దేశంలోనే వివిధ కళాశాలల్లోని విద్యార్థులకు పలు అంశాలపై వివిధ రాంగాల్లో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యావేత్తలతో కూడిన అనేక మంది దిశ భారత వేదిక ద్వారా పనిచేస్తున్నారని ఏపీ సమన్వయకర్త డాక్టర వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి, సీఎస్సీ అధ్యాపకులు కిషోర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి, జక్కులనెక్కలం గ్రామాల్లో మైనర్ డ్రెయిన్-1 పూడికతీత పనులను శనివారం ప్రారంభించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ జాస్తి విజయభూషణ్‌కుమార్ పర్యవేక్షణలో పొక్లెయిన్‌తో పూడికలు తీసి సాగునీటి పారుదలను క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా జాస్తి మాట్లాడుతూ.. సొంత నిధులు రూ.1.50 లక్షలతో పూడికలు తొలగిస్తున్నట్లు చెప్పారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

డొంక రోడ్డులో ఆక్రమణల తొలగింపు



యనమలకుదురులో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెనమలూరు: యనమలకుదురు గ్రామం తాడిగడప డొంక రోడ్డులో ఆక్రమణలు బాగా పెరగటంతో తాడిగడప మున్సిపాలిటీ సిబ్బంది ఆక్రమణలు తొలగించారు. గ్రామంలో శనివారం సిబ్బంది వాహనాల్లో వచ్చి తాడిగడప డొంక రోడ్డులో ముందుకు వచ్చిన దుకాణాల వద్ద ఆక్రణలు తీసేశారు. గత కొద్ది రోజులుగా డొంక రోడ్డులో ఆక్రమణలు జోరుగా ఉన్నాయి. దుకాణాల యజమానులు వారి దుకాణాల ఎదురుగా ఆక్రమించి డొంక రోడ్డు మీదకు వచ్చారు. దీంతో డొంకరోడ్డులో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఒకరిని చూసి మరొకరు ఆక్రమించటంతో పరిస్థితులు ఇబ్బందికరంగా మారాయి. దీంతో స్థానికులు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మున్సిపాలిటీ అధికారులు లాకుల సెంటర్ నుంచి ఆక్రమణలను తొగింపు పనులు ప్రారంభించారు. మొదటి రోజు రంగా బొమ్మ వరకు రోడ్డు పైకి వచ్చిన ఆక్రమణలు తీసేశారు. జన్మభూమి వంతెన రోడ్డు వరకు ఉన్న ఆక్రమణలు అన్నీ తొలగించనున్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తీసివేయాలని మున్సిపాలిటీ అధికారులు కోరారు. లేని పక్షంలో తామే ఆక్రమణలు తొలగిస్తామని హెచ్చరించారు.

డ్రెయిన్లలో పేరుకుపోతున్న వ్యర్థాలు

కంకిపాడు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు పారుదల కావటం లేదు. ఎక్కడి మురుగు అక్కడే పేరుకుని తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధ్వాన డ్రెయిన్లతో ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– కంకిపాడు



కంకిపాడు ప్రధాన సెంటరులోని డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఏసీబీ భయంతో పత్తాలేకుండా పోయిన అధికారులు

ఉయ్యూరు: ఉయ్యూరులో అధికారులు శనివారం పత్తా లేకుండా పోయారు. ప్రధాన కార్యాలయాలు అధికా రులు లేక వెలవెలబోయాయి. ఏ కార్యాల యానికి వెళ్లినా ఖాళీ కుర్చీలే కనిపించాయి. ఈ వ్యవహారంపై సిబ్బందిని ప్రశ్నిస్తే ఫీల్డ్ విజిట్ అంటూ సమాధానం ఇచ్చారు. అయితే మచిలీపట్నం కేంద్రంగా జరిగిన ఏసీబీ దాడుల నేపథ్యంలో తదుపరి దాడులు ఉయ్యూరులో జరిగే అవకాశం ఉందనే ప్రచారం కారణంగా అధికారులు పలాయనం చిత్తగించారనే ప్రచారం జోరుగా సాగుతోంది. మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు పలువురు మధ్యాహ్నం వరకూ కార్యాలయాలకు రాలేదు. నిత్యం రద్దీగా ఉండే రవాణశాఖ కార్యాలయం ఇద్దరు అధికారులు ఒకే రోజు సెలవుపై వెళ్లటంతో కార్యాలయ ప్రాంగణం నిర్మానుష్యంగా మారింది. ఏజెంట్లు సైతం అటు వైపు కన్నెత్తి చూడని పరిస్థితి. ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లోనూ ఇదే తీరు నెలకొంది. ఏసీబీ అధికారులు దాడులు చేస్తారనే ప్రచారం కారణంగానే అధికారులు అందరూ ముఖం చాటేశారని తెలుస్తోంది. ప్రధానంగా మున్సిపాలిటీ, రవాణ, రెవెన్యూ శాఖల్లో జరుగుతున్న అవినీతిపై పలువురు ఇటీవల ఏసీబీని ఆశ్రయించి ఫిర్యాదులు పంపారు. ప్రభుత్వ ప్రధాన శాఖల అధికారులకు లేఖలు వెళ్లాయి. ఈ ఫిర్యాదులు, లేఖల నేపథ్యంలోనే స్థానిక అధికారులకు ఏసీబీ దాడుల భయం పట్టుకుంది. ఈ అంశం పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇంట్లో చెప్పకుండా పరారైన బాలిక ఆచూకీని హనుమాన్‌జంక్షన్ పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్లితే.. విజయవాడ సనత్‌నగర్‌కు చెందిన బాలిక (15) గత కొంతకాలంగా బాపులపాడు మండలం కానుమోలులో తన పెద్దమ్మ ఇంటి వద్ద ఉంటుంది. తల్లి అనారోగ్య సమస్యలతో ఉండటంతో బాలిక పెద్దమ్మ ఇంట్లోనే ఉంటూ స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదీ రాత్రి ఇంటి నుంచి బాలిక పరారైంది. తెల్లవారేసరికి ఇంట్లో బాలిక కనిపించకపోవటంతో పెద్దమ్మ ఆందోళనకు గురై వెతుకులాట మొదలుపెట్టింది. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాకపోవటంతో హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో వెంటనే అప్రమత్తమైన హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ-2 ఎన్.ఎల్. నరసింహామూర్తి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. ఎట్టకేలకు పోలీసుల ప్రయత్నాలు ఫలించి ప్రకాశం జిల్లా పొదిలిలోని ఓ ఎగ్జిబిషన్ వద్ద బాలికను శనివారం పోలీసులు పట్టుకున్నారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లి, పెద్దమ్మలకు అప్పగించారు.

ప్రేమించకపోతే చంపేస్తా!

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తనను ప్రేమించకపోతే చంపేస్తానంటూ డిగ్రీ విద్యార్థినిని బెదిరించిన యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సింగ్‌నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలోని జీ ప్లస్‌త్రీ ఇళ్లల్లో నివసిస్తున్న గోవిందరాజు ఆటో డ్రైవర్. ఇతనికి ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ఇంటివద్దే ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన పువ్వుల చందన అనే వ్యక్తి గత కొన్ని నెలల నుంచి ప్రేమ పేరుతో వేధిస్తూ ఉండేవాడు. రెండు నెలల క్రితం యువతి తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు హెచ్చరించారు. అయితే మరలా వెంటబడి తనను ప్రేమించాల్సిందేనని, లేకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో యువతి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. యువతి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.